25 నుంచి పత్తి కొనుగోళ్లు



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈ నెల 25 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని, ఇందుకు సీసీఐ ద్వారా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పత్తి కొనుగోలు ప్రక్రియపై మార్కెటింగ్, సహకార, సీసీఐ, పోలీస్, అగ్నిమాపక, వ్యవసాయ శాఖ అధికారులు, కాటన్ మిల్లుల యజమానులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో 36,142 ఎకరాల్లో పత్తి సాగైందని, వచ్చే నెల మొదటి వారం నుంచి పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలన్నారు.

ఇందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయం అవసరమన్నారు. సీసీఐ ద్వారా తేమ శాతం యంత్రం, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాల్లో స్థానిక పోలీస్ అధికారులు, అత్యవసర నంబర్లు ఏర్పాటు చేయాలని, తూనికలు కొలతల శాఖ ద్వారా తూకం వేసే వాటికి స్టాంపింగ్ చేయాలని ఆదేశించారు. గోదాంలు, మిల్లుల వద్ద అగ్నిమాపక శాఖ ద్వారా ప్రమాదాలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. కాటల్లి(cott-ally) యాప్‌ను రైతులు డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఈ యాప్ నుంచే ఖాతాల్లో డబ్బుల జమ విషయం తెలుసుకోవచ్చన్నారు. యాప్ గురించి వ్యవసాయ శాఖ అధికారులు పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మద్దతు ధర క్వింటాకు రూ. 7,521 ప్రకటించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ అధికారి యాదయ్య, డీఏవో గోవిందు, అగ్నిమాపక అధికారి వేణు, తూనికలు, కొలతల శాఖ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు పరిశీలన

హవేలిఘనపూర్: అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. గురువారం హవేలిఘనపూర్ తహసీల్దార్ కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి తన ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ... పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నవంబర్ 23న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురించాలని, డిసెంబర్ 9 లోపు అభ్యంతరాలు స్వీకరించి డిసెంబరు 25 లోపు పరిష్కరించాలన్నారు. డిసెంబరు 30న తుది ఓటర్ జాబితా ప్రచురించాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సింధు రేణుక ఉన్నారు.

ఇరుకు వంతెనలు.. ప్రమాద ఘంటికలు

శాశ్వత చర్యలతోనే ప్రాణాలకు రక్షణ

న్యూస్‌టుడే, శివ్వంపేట, తూప్రాన్, చేగుంట: ప్రధాన మార్గాల్లో రోడ్లు వేసి వంతెనలు విస్తరించకపోవడం.. కల్వర్టులకు ఇరువైపులా గోడలు, దిమ్మెలు.. హెచ్చరిక బోర్డులు సైతం లేకపోవడంతో నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజాగా బుధవారం శివ్వంపేట మండలం ఉసిరికపల్లి కల్వర్టు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి ఏడుగురు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ ఘటన నుంచైనా అధికారులు సత్వరమే తేరుకుని చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



తూప్రాన్: తూప్రాన్ నుంచి గుండ్రెడ్డిపల్లి వెళ్లే దారిలో ఆబోత్‌పల్లి సమీపంలో కల్వర్టుకి ఇరువైపులా దిమ్మెలు వర్షాలకు కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు, రాత్రి సమయంలో అజాగ్రత్తగా ఉంటే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉంది.



చేగుంట మండలం మక్కరాజుపేట నుంచి చందాయిపేటకు వెళ్లే మార్గంలో ఇరుకైన వంతెన ఉంది. ఏడాది పొడవునా నీరుంటుంది. ఇక్కడ ప్రయాణం ప్రమాదకరమే. ముఖ్యంగా రాత్రి ఏమరుపాటుగా ఉంటే అంతే సంగతులు.



తూప్రాన్ నుంచి వెంకటరత్నాపూర్ వెళ్లే దారిలో సుమారు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. వంతెనపై సైడ్‌వాల్ నిర్మించాల్సి ఉండగా ఇనుప చువ్వలు పెట్టి వదిలేశారు.

రోడ్డు విస్తరిస్తూ.. కల్వర్టులు వదిలేసి..

నర్సాపూర్-తూప్రాన్ 161ఏఏ జాతీయ రహదారి శివ్వంపేట మండలం ఉసిరికపల్లి నుంచి వెల్దుర్తికి ఉన్న ఒక వరుస రహదారిని రెండు వరుసలుగా విస్తరిస్తున్నారు. రూ.18 కోట్లతో ఉసిరికపల్లి, పాంబండ, పోతుబోగుడ చౌరస్తా వరకు, దొంతి నుంచి గుండ్లపల్లి రోడ్డు కొంత వరకు తొమ్మిది కిలోమీటర్లు విస్తరిస్తున్నారు. పది నెలలుగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఉసిరికపల్లి వద్ద గోడలు లేకుండా రెండు వైపుల చిన్న రాతి దిమ్మెలతో ఇరుకుగా ప్రమాదకరంగా ఉంది. ఇక్కడే బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ ఈఈ సర్దార్‌సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్మాణంలో ఉన్న రోడ్లతో పాటు వంతెనల పనులకు నిధులున్నాయన్నారు. పెద్ద బ్రిడ్జిలైతే నిర్మాణం చేయాల్సి ఉంటుందన్నారు.



ఉసిరికపల్లి వద్ద ప్రమాదకరంగా కల్వర్టు

కొలతల్లో మోసాలను గుర్తించండి



మాట్లాడుతున్న తూనికలు, కొలతల జిల్లా అధికారి సుధాకర్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: కొలతల్లో జరిగే మోసాలను గుర్తించి, మళ్లీ జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తూనికలు, కొలతల శాఖ జిల్లా అధికారి సుధాకర్ విద్యార్థులకు సూచించారు. గురువారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో తూనికలు, కొలతలు-చట్టం అనే అంశంపై కార్యశాల నిర్వహించారు. అనంతరం పలు రకాల కొలతల పరికరాలను ప్రదర్శించి అవి ఎలా పని చేస్తాయో విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపల్ సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

19న ఉమ్మడి జిల్లా క్రికెట్ ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా బాలికల అండర్-17 క్రికెట్ ఎంపికలు ఈ నెల 19న ఎంఎస్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి అమూల్యమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒర్జినల్ బోనాఫైడ్‌తో క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు.

కోర్టు భవనం పరిశీలన

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: అల్లాదుర్గంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న జూనియర్ సివిల్ జడ్జి, ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాన్ని మెదక్ జిల్లా జడ్జి లక్ష్మీశారద గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 19న కోర్టును ప్రారంభిస్తామని, అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, బార్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు సుభాష్ చంద్రగౌడ్, న్యాయవాది శ్రీనివాస్, అశ్విన్ కుమార్, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా జడ్జి లక్ష్మీశారద

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు, ఆంగ్లం, వృక్షశాస్త్రం(ఉర్దు మీడియం), పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు పోస్టు ఖాళీగా ఉన్నాయి. విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలతో ఈ నెల 23వ తేదీ లోపు జిల్లా ఇంటర్ నోడల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికలకు కమిటీ ఉంటుందని, ఆయా పాఠ్యాంశాలలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

స్కావెంజర్లను నియమించాలి: పీఆర్టీయూ

మెదక్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని, వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు ఇవ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ కోరారు. ఇటీవల సంఘం జిల్లా కార్యవర్గం ఏర్పడిన నేపథ్యంలో సభ్యులు గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. సంఘ నాయకులు సంతోష్ కుమార్, మల్లారెడ్డి, నవీన్, శ్రీనివాస్ రెడ్డి, దుర్గయ్య పాల్గొన్నారు.

మహనీయుల జీవితాలు ఆదర్శం



వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి, కొమరం భీం వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. మహాకవి వాల్మీకి హిందూ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణం రచించారని.. దీని ద్వారా సమాజానికి అనేక విలువలు అందించారని కొనియాడారు. ఆదివాసి ఆత్మగౌరవానికి ప్రతీక కొమరం భీం అని, జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారని గుర్తుచేశారు.

● వాల్మీకి శ్రీరాముడి దివ్య చరిత్రను మానవాళికి అందించారని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ మహేందర్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెరిగిన రద్దీ.. సీట్లకు కుస్తీ



దసరా పండగకు సొంత గ్రామాలకు వచ్చి తిరిగి ఉద్యోగాలు, చదువులు, పనుల కోసం పట్టణాల బాట పట్టిన ప్రయాణికులతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. రద్దీ పెరగడంతో బస్సుల్లో సీట్ల కోసం ప్రయాణికులు కుస్తీ పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం మెదక్ కొత్త బస్టాండ్‌లో కనిపించిన దృశ్యమిది.

- న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

దండుగా కదలి.. దడ పుట్టించి..

మండల వ్యాప్తంగా కుక్కల బెడదతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గవ్వలపల్లి నుంచి రామాయంపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో సంగాయపల్లి వద్ద ఉన్న మూలమలుపులో, మడూరులోని మద్యం దుకాణం వద్ద కుక్కలు గుంపులుగా సంచరిస్తూ నడకదారిలో వెళ్లే వారిని, వాహనచోదకులపై దాడులకు దిగుతున్నాయి. దీంతో వారు భయాందోళనలకు గురవుతున్నారు. అధికారులు శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



-న్యూస్‌టుడే, చిన్నశంకరంపేట

పార్కింగ్‌కే సగం దారి



మెదక్ పట్టణంలోని నూతన బస్టాండు ఎదురుగా ఉన్న మెదక్-బోధన్ ప్రధాన రహదారిపై నిలిపిన వాహనాలు ఇవీ. ఆ రోడ్డుకు అనుకొని ఉన్న ప్రైవేట్ హోటళ్లకు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో అందులోకి వచ్చే ప్రజలు ఇలా వారి వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తున్నారు. ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళలతో పాటు ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో వాహనాల రద్దీ మరింత అధికంగా ఉంటుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- న్యూస్‌టుడే, మెదక్ టౌన్

వనదుర్గమ్మకు పల్లకీ సేవ

పౌర్ణమిని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాతకు గురువారం సాయంత్రం పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ఆలయం నుంచి సమీప శివాలయం వరకు ఊరేగించారు. ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు శంకరశర్మ, సిబ్బంది శ్యామ్, సూర్య శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



- న్యూస్‌టుడే, పాపన్నపేట

ముగిసిన కళా ఉత్సవ్ పోటీలు



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

మెదక్, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు గురువారం ముగిశాయి. స్థానిక వెలుగు పాఠశాలలో పాటలు, థియేటర్, కథా కథనం పోటీలు నిర్వహించారు. వాయిద్యాల పోటీలో అఖిల్(మెదక్), రాజు(వెల్దుర్తి), సతీష్ కుమార్(మానేపల్లి)కు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వచ్చాయి. కథా కథనంలో అర్పిత (చందంపేట), అక్షయ్, సాయి చరణ్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. నృత్య పోటీల్లో ఐశ్వర్య గ్రూప్, హాసిని, మేఘన, డ్రామా పోటీల్లో సింధు, గాయత్రి, పల్లవి బృందాలు, పాటల పోటీల్లో జీవన్, శరవయ్య, జ్యోతి, చిత్రలేఖనంలో రుచిత, స్పందన, అంజి కుమార్ బహుమతులు సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో నీలకంఠం, జిల్లా పరీక్షల విభాగం అధికారి రామేశ్వర ప్రసాద్, ఏఎస్‌వో నవీన్ కుమార్ ప్రశంసాపత్రాలను అందించారు. న్యాయ నిర్ణేతలు నర్సింగరావు, అంజాగౌడ్ , మాధవ రెడ్డి, ప్రవీణ్, రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పర్యటనకు ఏర్పాట్లు



పోలీసు, ఆలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో రమాదేవి

పాపన్నపేట, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి శనివారం ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకోనున్న సందర్భంగా మెదక్ ఆర్డీవో రమాదేవి గురువారం ఆలయం వద్ద పరిశీలించారు. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆలయ, పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, ఆర్ఐ నాగరాజు, తదితరులున్నారు.

రుణమాఫీ చేస్తేనే రైతులకు ప్రయోజనం: ఎమ్మెల్యే



వడియారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, న్యూస్‌టుడే: ప్రభుత్వం రైతులందరికి రుణమాఫీ చేస్తేనే ప్రయోజనం ఉంటుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం చేగుంట మండలం వడియారం, మక్కరాజుపేట, చందాయిపేటలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. చేగుంటలో 44వ జాతీయ రహదారి వంతెన కింద అధ్వానంగా మారిన రోడ్డును ఎన్‌హెచ్‌ఏఐ, ఆర్‌అండ్‌బీ అధికారులతో పరిశీలించారు. ఎమ్మెల్యే సూచనతో అధికారులు రోడ్డును బాగుచేసే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణాలు తీసుకున్నవారికి ఇప్పటికి కూడా మాఫీ చేయడం లేదన్నారు. రేషన్‌కార్డు లేనివారి నుంచి వివరాలు తీసుకున్న వారికి మాఫీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. ఆయన వెంట తహసీల్దారు నారాయణ, నాయకులు నారాయణరెడ్డి, శ్రీనివాస్, రాజిరెడ్డి, సుభాష్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాసంగి కార్యాచరణ ఖరారు

2.84 లక్షల ఎకరాల సాగుకు ప్రణాళిక

న్యూస్‌టుడే-మెదక్: వానాకాలం సీజన్ ముగిసింది. దిగుబడులు చేతికి వస్తున్నాయి. ఈ సారి సమృద్ధిగా వర్షాలు కురవడంతో నీటి వనరులు నిండుగా ఉన్నాయి. సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు పెరిగాయి. సెప్టెంబర్ నాటికి జిల్లాలో భూగర్భజలాలు సరాసరి 10.81 మీటర్ల పైకి చేరడంతో యాసంగి సాగుపై భరోసా కలిగింది. గతేడాది పోలిస్తే ఈసారి విస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. దీనికి అనుగుణంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. గతేడాది కంటే ఈసారి వరి నాలుగు వేల ఎకరాలు అదనంగా సాగు కావొచ్చని అంచనా వేశారు. దొడ్డురకం పంటను ఎక్కువ సాగు చేసే అవకాశం ఉంది.

సమృద్ధిగా నీరు...

రబీ సీజన్‌లో పంటల సాగుకు ఢోకా లేదు. గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జిల్లాలో అడపాదడపా వర్షాలు కురిసి వానాకాలం ముగిసినా గత కొద్దిరోజుల నుంచి వానలు పడుతున్నాయి. దీంతో జిల్లాలోని ఏకైక మధ్యతర ప్రాజెక్టు ఘనపూర్, చిన్ననీటి తరహా ప్రాజెక్టు హల్దీలోకి పెద్ద ఎత్తున నీళ్లు వచ్చిచేరాయి. ఇటీవల వర్షాలకు ఈ రెండు ప్రాజెక్టులు పొంగుతున్నాయి. ఇక జిల్లాలో చెరువులు, కుంటలు సైతం పొంగిపొర్లడంతో సాగుకు కలిసొచ్చే అవకాశం ఉంది.



పొంగి పొర్లుతున్న ఘనపూర్ ప్రాజెక్టు

విత్తనాల కొరత లేకుండా..

పంటల సాగుకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. గతేడాది యాసంగిలో 48,183 మెట్రిక్ టన్నుల ఎరువులు వినియోగం కాగా, వచ్చే సీజన్‌కు 48,491 టన్నులు అవసరమవుతాయని ప్రణాళిక రూపొందించారు. సొసైటీలు, ఆగ్రోస్, ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉంచేలా దృష్టి పెట్టనున్నారు.

వాతావరణం అనుకూలం: గోవిందు, జిల్లా వ్యవసాయ అధికారి

యాసంగిలో పంటల సాగుకు సానుకూల వాతావరణం నెలకొంది. రైతులు భూమిలోని తేమ అనుకూలంగా ఉంటే విత్తనాలు వేసుకోవచ్చు. సమృద్ధిగా కురిసిన వర్షాలతో బోర్లు, బావుల్లో నీటిమట్టాలు పెరిగాయి. వరి సాగు పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసింది.

జిల్లాలో వివరాలు

పంట	సాగు విస్తీర్ణం అంచనా (ఎకరాల్లో)
వరి	2,65,000
మొక్కజొన్న	2,700
జొన్న	8,810
శనగ	280
పొద్దుతిరుగుడు	430
వేరుశనగ	130
నువ్వులు	26
ఇతర పంటలు	6,460

ఎరువుల రకాలు	వినియోగం అంచనా (మెట్రిక్ టన్నులలో)
యూరియా	23,565
డీఏపీ	1,680
పొటాష్	1,755
కాంప్లెక్స్	20,591
ఎస్ఎస్‌పీ	900

మొక్కలు నాటడం బాధ్యత

చేగుంట, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రతి ఐకేపీ మహిళ ఒక మొక్క నాటి సంరక్షించే విధంగా కార్యాచరణ రూపొందించినట్లు డీఆర్డీవో శ్రీనివాసరావు అన్నారు. 'నా మొక్క...నా బాధ్యత' కార్యక్రమంలో భాగంగా గురువారం చేగుంటలోని తెలంగాణ గిరిజన క్రీడా బాలికల పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో మొదటిసారిగా మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ముందుగా చేగుంటలో వెయ్యి కొబ్బరి మొక్కలను ఐకేపీ మహిళల ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల ఆవరణలో నాటుతున్నట్లు తెలిపారు. ఇక్కడ విజయవంతం చేసి జిల్లా వ్యాప్తంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రిన్సిపల్ సుమతి, ఐకేపీ ఏపీఎం లక్ష్మినర్సమ్మ, ఏపీవో శ్వేత, సీసీ శ్వేత తదితరులున్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ


వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరులేని సమయంలో తాళాలు పగులగొట్టి చోరీ చేసిన ఘటన బస్వాపూర్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బొడ్డు అంజయ్య కుటుంబ సభ్యులతోపాటు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా ధ్వంసం చేసి 11 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 గ్రాముల వెండి, రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడు అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

గురుతర బాధ్యతతో అడుగెయ్

పాఠశాల రూపురేఖలను మార్చాలంటే కృతనిశ్చయం అవసరం. తోటివారితో పాటు పిల్లలు, తల్లిదండ్రుల మనసు గెలవాలి. సంకల్పం నెరవేరే వరకు విశ్రమించొద్దు.

ఉపాధ్యాయుడు.. విద్యార్థులకు ప్రత్యక్ష మార్గదర్శి. క్రమశిక్షణ, అంకిత భావం, సేవా కోణం, చైతన్య కెరటం.. ఇలా భిన్న పాత్రల సమాహారమే గురువు. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో తాజాగా వందలాది మంది ఉపాధ్యాయ కొలువులు చేపట్టారు. వీరంతా తమ ప్రత్యేకతను చాటాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఇందులో సాగుతున్న ఎంతో మంది మార్గదర్శకంగా నిలిచారు. తమదైన శైలి.. సృజనాత్మక బోధనతో విద్యార్థులతో మా మంచి మాస్టారు అని కీర్తినొందుతున్నారు. ఇలాంటి ఆదర్శప్రాయులను నవతరం బోధకులు అందిపుచ్చుకోవాల్సిన ఆవశ్యకతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, సిద్దిపేట



జాతీయ పురస్కారం గెలిచి..



సిద్దిపేటకు చెందిన రామస్వామి 2015 నుంచి 2022 వరకు ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేశారు. బడిని ఆదర్శంగా తీర్చిదిద్దడంలో గురుతర పాత్ర పోషించారు. బాధ్యత చేపట్టిన ఏడాదిలోనే మార్పు తీసుకొచ్చారు. విద్యార్థులు 300 మంది నుంచి వేయి సంఖ్య దాటేందుకు సమష్టిగా కృషి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. సాంకేతిక వినియోగంలో స్ఫూర్తి చాటారు. 2022లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ప్రస్తుతం సిద్దిపేట డీఈవో కార్యాలయంలో ప్రణాళిక విభాగం సమన్వయకర్తగా కొనసాగుతున్నారు.

– న్యూస్‌టుడే, సిద్దిపేట

బడిని బతికించి..



ఎంతోమందిలో విద్యా వెలుగులు నింపేది పాఠశాలే. దీని సంరక్షణ అందరి బాధ్యత. బడి మాది అనుకుంటే పిల్లలెంతో మంది బాగుపడ్డట్లే.

మల్లుక్ మండలం అంగడికిష్టాపూర్ పాఠశాలలో 2015లో విద్యార్థుల సంఖ్య కేవలం 8 మందే. స్థానిక పిల్లలంతా ప్రైవేటుకు వెళ్తున్నారు. ఈ తరుణంలో హెచ్‌ఎంగా ఓంకార్ రాధాకృష్ణ, ఉపాధ్యాయులుగా నుస్రత్, రామకృష్ణారెడ్డి బదిలీపై వచ్చారు. బడిని బతికించుకోవాలని కంకణం కట్టుకున్నారు. ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వారిని ఒప్పించి పిల్లలను ప్రైవేటుకు పంపించమని తీర్మానం చేయించారు. వారికి స్థానికులు అండగా నిలిచారు. ప్రస్తుతం 207 మంది ఉన్నారు. ఇప్పటికీ ఆ ఉపాధ్యాయులు చైతన్యంతో బడి వెలిగిపోతోంది. పలు పురస్కారాలూ దక్కాయి. – న్యూస్‌టుడే, ములుగు

వారితో మమేకమై..



విద్యార్థుల మనసు గెలవడం కాసింత కష్టమే. అలాంటి వారు ఎక్కడో ఓ చోట కనిపిస్తారు. ఒక్కసారి పిల్లలను ఆకట్టుకుంటే గుండెల్లో పెట్టుకొని పూజిస్తారు.

కొడంగల్ పరిధి పాతకొడంగల్ ప్రాథమిక పాఠశాలలో పని చేసిన క్రాంతికుమార్.. విద్యార్థులతో మమేకమై బోధించారు. పిల్లలకు అన్నిరకాలుగా అండగా నిలిచారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పేదలకు సాయం అందించారు. నవోదయ, గురుకుల వంటి పరీక్షల్లో విజయానికి కృషి చేశారు. తల్లిదండ్రులకు చదువు ఆవశ్యకత చెప్పి బడికి పంపించేలా చేశారు. విధుల్లో చేరిన సమయంలో 27 మంది ఉండగా.. ఆ తర్వాత 64కు చేరింది. ఇటీవల హుసేన్‌పూర్‌కు బదిలీ కాగా, ఆ సమయంలో విద్యార్థులు, గ్రామస్థులు కంటతడి పెట్టుకున్నారు.

– న్యూస్‌టుడే, కొడంగల్

పిల్లలు నష్టపోవద్దని..



ఆకట్టుకునేలా బోధించడం ఉపాధ్యాయుడి కర్తవ్యం. ఇందుకు ఎంతో కృషి అవసరం. వారి సర్వతోముఖాభివృద్ధికి చొరవ చూపాలి.

సాధారణంగా సెలవు దొరికితే ఎవరైనా సరదాగా గడుపుదాం అనుకుంటారు. రామాయంపేట ఉన్నత పాఠశాలలో ఆంగ్లం బోధించే రమేశ్ మాత్రం అలా కాదు. మండలంలోని కాట్రియాల ఉన్నత పాఠశాలలో ఆంగ్ల బోధకులు లేకపోవడంతో ఈయనే చొరవ చూపి అక్కడికెళ్లి పాఠాలు చెబుతూ వచ్చారు. సెలవు రోజుల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా పాఠ్యాంశాలు బోధించారు. మరోవైపు ఇతర పిల్లలకు సైతం ఇంగ్లిష్ నేర్పించడం విశేషం.

– న్యూస్‌టుడే, రామాయంపేట

మానవత్వం చాటుతూ..

సమాజ పరిస్థితిని మార్చడంలోనూ ఉపాధ్యాయుడిది కీలకపాత్ర. ఈ మార్గంలో నడిస్తే ఎంతో మంది బాగుపడటం ఖాయం.



మతిస్థిమితం లేని బాలికను చేరదీసి..

గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన జంగం సౌజన్య మెదక్ జిల్లా కొడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్నారు. ఈమె సామాజిక సేవలోనూ ముందుంటున్నారు. ఎవరైనా అభాగ్యులు, ఆపదలో ఉన్న వారు కనిపిస్తే చలించిపోతారు. మతిస్థిమితం కోల్పోయిన వారిని చేరదీసి వారి ఆకలిని తీరుస్తున్నారు. ఆశ్రమాల్లో చేర్పిస్తారు. మహిళలను సఖి కేంద్రానికి తరలిస్తున్నారు. ఇప్పటివరకు 8 మందిని ఆదుకున్నారు. – న్యూస్‌టుడే, గజ్వేల్

అన్నింటా తీర్చిదిద్ది..



విద్యార్థులతో శ్రీనివాస్‌రావు

విద్యార్థుల భవితకు మార్గం చూపాల్సిన గురుతర బాధ్యత గురువులదే. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మరువద్దు.

జిన్నారం మండలం ఐడీఏ బొల్లారం జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా 8 ఏళ్లకు పైగా విధులు నిర్వర్తించిన అడ్డాడ శ్రీనివాస్‌రావు.. తెలుగు ఉపాధ్యాయుడైన ఈయన విద్యార్థులు వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటేలా చేశారు. ప్రత్యేక చొరవ చూపి 150 మంది బాలకవులు, 200 మంది పుస్తక సమీక్షల్లో, మరో 100 మంది కథలు రాసే ప్రతిభావంతులుగా రూపుదిద్దడంలో కీలకంగా వ్యవహరించారు. సెలవులను సైతం ఇందుకే కేటాయించేవారు. ఇటీవల ఎద్దుమైలారం జడ్పీ పాఠశాలకు బదిలీ అయ్యారు.

– న్యూస్‌టుడే, జిన్నారం

సైన్స్‌లో ఇప్పటికీ వెనకబడి ఉన్నాం

త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి



ఐఐటీహెచ్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తికి అవార్డు అందజేస్తున్న ఇంద్రసేనారెడ్డి, డాక్టర్ సతీష్‌రెడ్డి చిత్రంలో డాక్టర్ భుజంగరావు, ఎస్.బి.రామ్, లక్ష్మీనారాయణ

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలోని పలు చిన్నదేశాలు విభిన్న అంశాల్లో ఆధిపత్యం ప్రదర్శిస్తున్నాయని, 140 కోట్లకుపైగా జనాభా ఉన్న అతి పెద్ద దేశం భారత్ ఈ విషయంలో ఇంకా వెనకబడి ఉందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. చిప్స్ తయారీలో ముందున్న తైవాన్‌పై బలమైన దేశాలు ఆధారపడుతున్నాయని.. ఈ తరహాలో భారత్ సైతం కొన్ని అంశాల్లో ఆధిపత్యానికి ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్షణ శాఖ మంత్రి మాజీ శాస్త్రీయ సలహాదారు, డీఆర్డీవో మాజీ డైరెక్టర్ జనరల్, బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ మాజీ డైరెక్టర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం మొదటి తెలుగు ఉపకులపతి డాక్టర్ సూరి భగవంతం జయంతి వేడుకలు గురువారం ఓయూలోని దూరవిద్యా కేంద్రం ఆడిటోరియంలో జరిగాయి. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడారు. మనదేశం రక్షణ రంగంలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా స్వయం సమృద్ధి సాధించడం వెనక డీఆర్డీవో డీజీగా డాక్టర్ సూరి భగవంతం వేసిన పునాదే కారణమని డీఆర్డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ దూరం లక్ష్యాన్ని గురిపెట్టే గన్ భారత్‌లో మాత్రమే ఉందని.. ఈ దశకు చేరుకోవడంలో సూరి కృషి ఉందన్నారు.

ఐదుగురికి ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సూరి భగవంతం ఎక్స్‌లెన్స్ అవార్డులను ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్. మూర్తి, ఇస్రో-ఎన్‌ఆర్‌ఎస్‌సీ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌చౌహాన్, ఇంటిలిజెంట్ డిజైన్ ఏఐ సీఈవో, సీటీవో రవి నిమ్మగడ్డకు ప్రదానం చేశారు. డీఆర్‌డీవో మిసైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డీజీ యు.రాజబాబు స్థానంలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జి.ఏ.ఎస్.మూర్తికి, రివి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ మొచ్చెర్ల శశిభూషణ్ స్థానంలో శరత్‌కు అవార్డులను బహూకరించారు. ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీవో మాజీ డీజీ వి.భుజంగరావు, డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ వ్యవస్థాపక డైరెక్టర్ ఎస్.బి.రామ్ తదితరులు మాట్లాడారు.

వేదన.. రోదన

- శోకసంద్రంగా మారిన తూప్రాన్ ఆసుపత్రి ఆవరణ
- మృతదేహాల కోసం వచ్చిన బాధితులు



విషణ్ణవదనాలతో బాధిత కుటుంబ సభ్యులు



తూప్రాన్, శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం ఉసిరికపల్లి శివారులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతిచెందిన విషయం విదితమే. గురువారం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రిలో కట్టుదిట్టమైన పోలీసుల భద్రత మధ్య శవ పంచనామా నిర్వహించారు. ఈ సమయంలో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి. ఈ క్రమంలోనే కొంతమంది సొమ్మసిల్లి కింద పడిపోయారు. మృతదేహాలను చూసేందుకు బంధువులు భారీగా తరలివచ్చారు. డీఎస్పీ వెంకటరెడ్డి, ఆస్పత్రి పర్యవేక్షకులు అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల సమయంలో శవ పంచనామా ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలకు ఏడు మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. మృతదేహాలను ట్రాక్టర్‌లో ఎక్కించే సమయంలో మృతురాలు అనిత భర్త మోహన్ బంధువులు ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ నామ్‌సింగ్‌ను తీసుకొచ్చే వరకు మృతదేహాలను తీసుకెళ్లమని నిరసన తెలిపారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

పోలీసు పహారాలో అంత్యక్రియలు

శివ్వంపేట మండలంలోని మూడు తండాల్లో పోలీసు భద్రత మధ్య రోడ్డు ప్రమాద మృతులకు అంత్యక్రియలు జరిగాయి. భీమ్లా తండాలో గూగులోత్ శాంతి, ఆమె కూతురు మమత (10వ తరగతి), జగ్య తండాలో మాలోత్ అనిత, ఆమె కుమార్తెలు హిందు(8వ), శ్రావణి (5వ), తాళ్లపల్లి తండాలో ధనావత్ శివరాం, దుర్గి అంత్యక్రియలు చేపట్టారు. మూడు కుటుంబాల వారు రక్తసంబంధీకులు కావడంతో ఎక్కడి వారు అక్కడే అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సంఘటనకు కారకుడైన భీమ్లా తండాకు చెందిన కారు డ్రైవర్ గుగులోత్ నామ్‌సింగ్‌ను అప్పగించాలని ఆగ్రహించిన అనిత బంధువులు ఆయన కుమారుడు రాజేష్‌పై చేయి చేసుకున్నారు. భీమ్లా తండా, జగ్య తండాలో బాధిత కుటుంబాలను శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి పరామర్శించారు. మృతదేహాలకు నివాళి అర్పించారు. రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. శివ్వంపేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు మహేష్ గుప్తా బాధిత కుటుంబాలను తూప్రాన్ ఆసుపత్రిలో బుధవారం రాత్రి పరామర్శించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు.



జగ్యా తండాలో ఆవేదనలో అనిత భర్త మోహన్

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య



అంజయ్య

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలతో ఓ రైతు పొలంలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై హరీశ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వెల్పుల అంజయ్య (51)కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పిల్లలందరికీ వివాహాలు అయ్యాయి. ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు, తరచుగా కుటుంబ కలహాలు చోటుచేసుకుంటుండటంతో అంజయ్య పోతారెడ్డిపేటలో కౌలుకు తీసుకున్న పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. భార్య గంగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తూప్రాన్‌లో వృద్ధుడు..

తూప్రాన్: వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తూప్రాన్‌లో గురువారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై శివానందం తెలిపిన వివరాలు.. పండ్ల వ్యాపారి ఉడుత నాగయ్య (75) తూప్రాన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ఓ ఇంట్లో భార్య లక్ష్మితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి దాటాక ఇంట్లో నుంచి బయటకు వచ్చిన నాగయ్య పక్కనే ఉన్న రేకుల షెడ్డుల్లో ఉరేసుకున్నాడు. అర్ధరాత్రి లక్ష్మికి భర్త కనిపించకపోవడంతో బయటకు వెళ్లేందుకు యత్నించింది. గడియ పెట్టి ఉండటంతో పక్కింటి వారి సాయంతో బయటకు వచ్చి చూడగా నాగయ్య విగతజీవిగా కనిపించాడు. నాగయ్య మృతిపై అనుమానం ఉందని విచారణ చేపట్టాలని లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గిరిజన న్యాయ కళాశాల పిలుస్తోంది!

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

ఈనెల 19న తక్షణ ప్రవేశాలు



గిరిజన గురుకుల న్యాయ కళాశాల

కళాశాలలో విద్యార్థులు	
ప్రథమ	20
ద్వితీయ	26
తృతీయ	27
నాలుగో	37
ఐదో	31

గిరి పుత్రులను న్యాయ విద్యలో రాణించేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగేసింది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట న్యాయ కళాశాలను ఏర్పాటుచేసింది. దేశంలో గిరిజన (పురుషుల) గురుకుల న్యాయ కళాశాల ఇదొక్కటే కావడం విశేషం. ప్రస్తుతం న్యాయ విద్య కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 19న తక్షణ ప్రవేశాలకు అవకాశం కల్పించారు. ఇక్కడ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడం విశేషం.

ఐదేళ్ల కోర్సు..

ఇంటర్ అర్హతతో లాసెట్ రాసిన వారిలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్లు సైతం వర్తింపజేస్తారు. ఇక్కడ సీటు సాధిస్తే ఐదేళ్లలో న్యాయ విద్య కోర్సు (బీఏ, ఎల్‌ఎల్‌బీ) పూర్తి చేయవచ్చు. 2020-21 విద్యా సంవత్సరం నుంచి కొనసాగుతోంది. ఏటా 60 మందికి తొలి సంవత్సరంలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తున్నారు. సరైన అవగాహన లేక ఎంతో మంది ఈ కళాశాలను ఎంచుకోకపోవడంతో సీట్లు మిగిలిపోతున్నాయి. గత విద్యా సంవత్సరం 34 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రవేశాలు షురూ అయిన నేపథ్యంలో ఆసక్తి ఉన్న వారు వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి

నిరీక్షణరావు, న్యాయ కళాశాల ప్రిన్సిపల్



సంగారెడ్డిలోని గిరిజన సంక్షేమ గురుకుల న్యాయ కళాశాలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసింది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. తొలి సంవత్సరంలో 60 సీట్లకు అత్యధికంగా 51 సీట్లు ఎస్టీలకే ఉంటాయి. మిగతా వాటిని రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేస్తారు. ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాం. ప్రవేశాలు పొందిన వారిలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు హైకోర్టులో ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ సమయంలో స్టైఫండ్ అందుతుంది.

మెరుగైన సదుపాయాలు

కళాశాలలో సీటు సాధిస్తే ఎలాంటి ఖర్చు లేకుండానే కోర్సు పూర్తి చేయవచ్చు. భోజన, వసతి సదుపాయాలు ఉంటాయి. నిపుణులైన అధ్యాపకులు బోధిస్తారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. 20 కంప్యూటర్లతో కూడిన ఈ-గ్రంథాలయం కూడా ఉండటం విశేషం. విద్యార్థుల ఆరోగ్యానికి బాటలు వేసేలా ఆధునిక వ్యాయామశాల ఏర్పాటుచేశారు.



మెదక్ చర్చిలో విదేశీయుల సందడి

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్‌లోని సీఎస్ఐ చర్చిని గురువారం అమెరికాకు చెందిన 19 మంది సందర్శించారు. వారు ప్రార్థనా మందిరంలో ఆరాధన చేపట్టారు. చర్చిని సందర్శించి స్వీయ చిత్రాలు దిగుతూ సంతోషం వ్యక్తం చేశారు. పలువురు వారితో చిత్రాలు దిగి సందడి చేశారు. – న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

పల్లె నుంచి సినీ దర్శకుడిగా..



సిద్దిపేట జిల్లా చేర్యాల పరిధి గుర్జకుంటకు చెందిన పుర్మ స్మరణ్‌రెడ్డి సినీ దర్శకుడిగా మారడం అక్కడి వారిలో సంతోషాన్ని నింపింది. అతడికి సినిమాలు అంటే ప్రాణం. అదే ఇష్టంతో అడుగేసి చిత్ర దర్శకుడిగా మారడం విశేషం. స్మరన్‌రెడ్డి తల్లిదండ్రులు అరుణ, రాంభూపాల్‌రెడ్డి. కుటుంబం చేర్యాలలో స్థిరపడగా, స్మరణ్‌రెడ్డి పది వరకు స్థానికంగా చదువుకున్నారు. ఇంటర్, బీటెక్ హైదరాబాద్‌లో పూర్తిచేశారు. సినిమాలపై మక్కువతో ఇంజినీరింగ్ పూర్తవగానే ఈ రంగాన్ని ఎంచుకున్నారు. చిత్ర దర్శకురాలు నందినిరెడ్డి వద్ద సహాయకుడిగా పనిచేశారు. 2017లో 'ఎమోషన్' లఘుచిత్రానికి దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'లవ్ రెడ్డి' సినిమా రూపొందించారు. 'ఆంధ్ర- కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో యువ జంట ప్రేమే ఈ చిత్ర కథాంశం. ఈ సినిమా శుక్రవారం విడుదల కానుంది. వాస్తవ ఘటనల ఆధారంగా నా తొలి చిత్రాన్ని రూపొందించానని, మైత్రీ మూవీ మేకర్స్ వాళ్లు డిస్ట్రిబ్యూట్ చేయడం సంతోషంగా ఉందని స్మరణ్‌రెడ్డి తెలిపారు. – న్యూస్‌టుడే, చేర్యాల

నీతో మేమూ వస్తాం..

- పక్కింటి యువకుడి బైకు ఎక్కిన విద్యార్థులు
- బస్సు ఢీకొని ముగ్గురూ దుర్మరణం



నవీన్‌కుమార్ హర్షవర్ధన్ ప్రవీణ్‌కుమార్

పూడూరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలుడితో సహా యువకుడు అక్కడికక్కడే మృత్యువాత పడగా.. ఆస్పత్రికి తరలిస్తుండగా మరోయువకుడు ప్రాణాలు వదిలారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పూడూరు గేటు వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గొంగుపల్లికి చెందిన ఎం.ప్రవీణ్(21) కూలీ. అతడికి భార్య అఖిల, ఏడాది కుమారుడు ఉన్నారు. మేడికొండలోని తన అమ్మమ్మ ఊరిలో శుభకార్యానికి రెండు రోజుల కిందట ఒంటరిగా వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అదే గ్రామానికి చెందిన విద్యార్థులు వికారాబాద్ వైపు వెళ్లాల్సిన చిల్కమర్రి నవీన్‌కుమార్(20), బుడ్డమొళ్ల హర్షవర్ధన్(15) తమను మన్నెగూడలో దింపాలని అభ్యర్థించారు. దీంతో అతడు కాదనలేక ఇద్దరినీ తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. గ్రామం నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరంలోని హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారి పైకి చేరుకున్నారు. సరిగ్గా పూడూరు గేటు వద్దకు ద్విచక్రవాహనం రాగానే.. హైదరాబాద్ నం-1 డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు నేడం వెళ్తుండగా.. ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నవీన్, హర్షవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందారు. వాహనాన్ని నడిపే ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో స్థానికులు అతడిని పరిగి ఆస్పత్రికి తరలిస్తుండగా.. దారిలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ నారాయణరెడ్డి, డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాద కారణాల్ని సీఐ, ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. ఆర్టీసీ అధికారులు బాధిత కుటుంబాలకు రూ.10 వేల చొప్పున సహాయం అందించారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు.

కళాశాలకు వెళ్తూ..

మేడికొండకు చెందిన చిల్కమర్రి యాదయ్య, అంజమ్మలకు ముగ్గురు కుమారులు. వారిది వ్యవసాయ కుటుంబం. చిన్నవాడు నవీన్‌కుమార్ వికారాబాద్‌లోని శ్రీ అనంతపద్మనాభ కళాశాలలో ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ప్రస్తుతం ఆర్మీ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. దసరా సెలవులు ముగిసిన దరిమిలా.. కళాశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రవీణ్ బైక్ లిఫ్ట్ అడిగాడు.

ఎస్సీ గురుకులానికి..

మేడికొండకు చెందిన బుడ్డమొళ్ల చిన్న నర్సింలు, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. కూలీ పనులు చేసుకుంటున్నారు. పెద్ద కుమారుడు స్థానికంగా పదోతరగతి చదువుతుండగా.. చిన్నకుమారుడు హర్షవర్ధన్ వికారాబాద్ పట్టణ పరిధి అనంతగిరిపల్లి సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు ముగియడంతో గురుకులానికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై ఎక్కి తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. ఇద్దరూ పక్కపక్క నివాసాల్లో ఉండడంతో స్థానికంగా విషాదం అలుముకొంది.

ఆధారం కోల్పోయిన కుటుంబం..

ప్రవీణ్‌కుమార్‌కు దోమ మండలం దాదాపూర్‌కు చెందిన అఖిలతో రెండేళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఏడాది కుమారుడు ఉన్నారు. భార్య, కుమారుడు ఇద్దరూ.. దసరాకు పుట్టింటికి వెళ్లారు. దీంతో భర్త ఒక్కడే శుభకార్యానికి వెళ్లాల్సి వచ్చింది. అనుకోకుండా రోడ్డు ప్రమాదంలో భర్త తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తన ఆధారం కోల్పోయామని కన్నీరు మున్నీరైంది.

వాహనం ఢీకొని.. వివాహిత దుర్మరణం



వనిత

వర్గల్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో వివాహిత మృతి చెందింది. ఆమె కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్‌కు చెందిన దేవేందర్ కుటుంబీకులతో హైదరాబాద్ దోమలగూడలో ఉంటూ పోటీపరీక్షలకు సిద్ధం అవుతున్నాడు. పండగకు ఇంటికి వెళ్లిన తల్లి గోపన్నగారి వనిత(46) సహా దేవేందర్ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ క్రమం జరిగిన ప్రమాదంలో దేవేందర్ ఎగిరి రోడ్డు పక్కకు పడిపోయాడు. తల్లి వనిత రోడ్డుపై పడగా ఢీకొట్టిన వాహనం ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబీకుల నుంచి ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ చెప్పారు. వనితకు భర్త, ఇద్దరు కుమారులు దేవేందర్, చాణక్య ఉన్నారు.

కారు బోల్తాపడి వ్యాపారి..

కొండపాక గ్రామీణం (కుకునూరుపల్లి): కారు బోల్తాపడి ఓ వ్యాపారి మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు.. హైదరాబాద్ కాచిగూడలో కార్వ రాజేశ్(42) వ్యాపారం చేస్తున్నాడు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో బంధువుల ఇంటికి వెళ్లి కారులో గురువారం తెల్లారుజామున తిరుగు ప్రయాణమయ్యాడు. రాజీవ్‌రహదారిలో కుకునూరుపల్లి వద్ద రోడ్డు పక్కన ఇనుప కడ్డీలకు తాకి అనంతరం మరో కారును ఢీకొని బోల్తాపడింది రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువు కాల్వ బేణిగోపాల్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు..

సిద్దిపేట టౌన్: రాజీవ్‌రహదారిపై రంగీలా దాబా చౌరస్తా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని లింగారెడ్డిపల్లికి చెందిన తాళ్ల మల్లారెడ్డి (65)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. గురువారం తెల్లవారుజామున పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. మల్లారెడ్డిని హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోదరుడు యాదిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

కళలకు జీవం పోయడం అభినందనీయం



రామలింగేశ్వరాలయంలో శిబిరాన్ని ప్రారంభిస్తున్న కొలుపుల మహేశ్

దుబ్బాక, న్యూస్‌టుడే: అంతరించి పోతున్న ఒగ్గు కళలకు తెలంగాణ ప్రభుత్వం జీవం పోసి, వెలికి తీయడం అభినందనీయమని ఒగ్గు కథల ప్రధాన శిక్షకులు కొలుపుల మహేశ్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీ మల్లికార్జున ఒగ్గుకళా సేవాసమితి వారి ఆధ్వర్యంలో గురువారం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఒగ్గుకథ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ సహకారంతో ప్రారంభించిన ఈ శిక్షణ శిబిరంలో 40 మందికి 41 రోజులపాటు ఒగ్గు కథపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సహాయ శిక్షకులు గుట్టయ్య, దేవయ్య, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	120–00	డ్రెస్డ్	206–00
రిటైల్	142–00	స్కిన్‌లెస్	234–00

TG

పట్టభద్రులు దరఖాస్తు చేసుకోండి

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి పట్టభద్రులు గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అన్నారు. గురువారం అల్లాదుర్గం తహసీల్దార్ కార్యాలయం, కొత్త ఏర్పాటు చేసే భవనాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడారు. దరణి పిర్యాదులపై పరిశీలన చేయాలని, మీ-సేవ ద్వారా ఇవ్వాల్సిన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ మల్లయ్య, ప్రభుత్వ తదితరులు ఉన్నారు.

మూఢ నమ్మకాలతో భవిష్యత్తు అంధకారం

రామాయంపేట, న్యూస్‌టుడే: నవ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేష్ అన్నారు. మంత్రాల నెపంతో దాడులు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఆదేశంతో మండలంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. గురువారం రామాయంపేట మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నరేష్, పోల్గొని పలు ప్రదర్శనలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతబడి, బాణామతి, మంత్రాలు వంటివి మూఢ నమ్మకాలన్నారు. అనంతరం ఎస్సై బాలరాజు, పలువురు మాట్లాడుతూ.. నకిలీ స్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నారన్నారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

పాపన్నపేట, న్యూస్‌టుడే: పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 147 మందికి కంటి పరీక్షలు చేపట్టగా 12మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. త్వరలో వారికి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, టెక్నాల్ పీహెచ్‌సీ నేత్ర వైద్య సహాయకుడు శ్యామ్‌రావు తదితరులున్నారు.

మండలానికే ఆదర్శం..పేట సహకార సంఘం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: సాధారణంగా వివిధ గ్రామాలను కలుపుతూ ఒక సహకార సంఘం ఉంటుంది. ఆయా గ్రామాల రైతులు ఆ సంఘం వద్దకు వెళ్లి పంటకు అవసరమైన యూరియా, డీఏపీ బస్తాలను తెచ్చుకుంటారు. చిన్నశంకరంపేట సహకార సంఘం అందుకు భిన్నంగా మండలంలోని ప్రతి గ్రామ రైతులు వచ్చినా వారికి ఎరువు మందు బస్తాలను అందిస్తారు. సహకార సంఘం అభివృద్ధికి దశాబ్ద కాలం నుంచి కామారం గ్రామానికి చెందిన ఛైర్మన్ అంజిరెడ్డి ఎనలేని సేవలను చేస్తూ మండలంలోని రైతుల ఆదరాభిమానాలు, మన్ననలు పొందుతున్నారు. గత ఐదేళ్లుగా రైతులను అనేక సమయాల్లో ఆదుకోవడంతో మరోమారు ఆయనే ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు.



సహకార సంఘం భవనం



హిస్సా సహకార సంఘం అద్దె దుఖ్ఖలు ఆదా చేస్తున్నారు. భవనం వల్ల సహకార సంఘానికి ప్రయోజనం ఉండాలని మరో రెండు అంతస్తులను అద్దెకు ఇచ్చేందుకు నిర్మించారు. గోదాములో రైతులకు అనుగుణంగా విత్తనాలను, ఎరువుల బస్తాలను అందుబాటులో ఉంచుతున్నారు. ఈ సహకార సంఘం పరిధిలో కామారం, కామారం తండా, చిన్నశంకరంపేటను కలుపుతూ ఉంది. సంఘం కింద ఉన్న కాకుండా మండలంలోని ఏ గ్రామం నుంచి రైతులు ఎరువులకు వచ్చినా కాదనకుండా ఇచ్చి పంపిస్తుంటారు. ఎరువుల వివరాలను నిత్యం అధికారులకు, రైతులకు తెలిసేలా బోర్డును అందుబాటులో ఉంచుతారు. సిబ్బంది సమయపాలనతో దాదాపు జగ్రత్తలు తీసుకుంటారు. ఇప్పటి వరకు సంఘం ద్వారా సుమారు రూ.50లక్షల విలువైన ఎరువు మందుల అమ్మకాలు జరిగాయి.

రూ.70లక్షలు వెచ్చించి: మండల కేంద్రం చిన్నశంకరంపేటలో సహకార సంఘానికి పక్కా భవనం ఉండాలని అదనంగా రూ.70లక్షల వెచ్చించి రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించారు అంజిరెడ్డి. అందులోనే ఎరువుల గోదాంను నిర్వ

కొనుగోళ్లకు స్థలం లేదు: అంజిరెడ్డి

ప్రతి ఏటా రైతులు పండించిన వరి ధాన్యాన్ని సహకార సంఘం కొనుగోలు చేస్తుంది. రైతులు ఎంత ధాన్యం తెచ్చినా లారీలను సర్దుబాటు చేస్తూ ధాన్యాన్ని సేకరిస్తున్నాం. ఈ ఏడాది కూడా కొనుగోళ్లు త్వరలో ప్రారంభిస్తాం. ప్రతి ఏటా వరి ధాన్యం పండించే రైతులు ఎక్కువ కావడంతో సహకార సంఘం స్థలంలో ధాన్యం పట్టడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్థలాన్ని కేటాయించేలా చూస్తానని సానుకూలత తెలిపారు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు వారి కష్టం తెలుసని, రానున్న కాలంలో మండలానికే కాకుండా జిల్లాలోనే పేట సంఘం మరింత ఆదర్శంగా నిలిచేలా కృషి చేస్తా.

న్యూస్‌టుడే, అల్లాదుర్గం, మనోహరాబాద్

? అల్లాదుర్గంలో జడ్పీహెచ్ బాలికల పాఠశాల వద్ద చెత్తాచెదారం వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. – ప్రవీణ్, స్థానికుడు

✓ త్వరలో సమస్య పరిష్కరించి, ఇబ్బందులు లేకుండా చేస్తాం. – ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి

? మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ప్రధాన రహదారిపై కొన్నిచోట్ల వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలి. వాహనాలు వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. – శ్రీకాంత్, కాళ్లకల్

✓ గ్రామంలో పలుచోట్ల వేగ నిరోధకాలు ఇబ్బందికరంగా ఉండడంతో తొలగించాం. అవసరమైన చోట నిరోధకాలు ఏర్పాటు చేస్తాం. – రాజు, పంచాయతీ కార్యదర్శి

? మనోహరాబాద్ మండలం కోనాయపల్లి(పీటీ)లోని పలు వీధుల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – నరేష్, కోనాయిపల్లి

✓ చెట్లగౌరారం నుంచి వచ్చే మిషన్ భగీరథ పంపింగ్ వద్ద సమస్య తలెత్తింది. గ్రామంలోని బోర్ల ద్వారా సరఫరా చేస్తున్నాం. దీంతో నీటిలో ఇబ్బంది తలెత్తింది. రెండురోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. – వేణుగోపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

? దండుపల్లి ప్రధాన రహదారిపై వర్షానికి భారీ గోతులు ఏర్పడ్డాయి. గుంతలు పడి వర్షం నీరు నిలిచింది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – మల్లేశ్, దండుపల్లి

✓ సంబంధిత శాఖ అధికారులకు సూచించి గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. – హేమలత, పంచాయతీ కార్యదర్శి, దండుపల్లి

వాటర్ డిస్పెన్సరీ అందజేత

చేగుంట, న్యూస్‌టుడే: చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంప సేవకుడు అయిత పరంజ్యోతి వాటర్ డిస్పెన్సరీని గురువారం అందజేశారు. వైద్యాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి, ఫార్మాసిస్టు రాజేష్ తదితరులున్నారు.

వార్డుల పునర్విభజనకు వినతి

గజ్వేల్: మున్సిపాలిటీలోని 16, 17 వార్డులను పునర్విభజన చేయాలని వార్డుకు చెందిన యువకులు రాజు, రమేష్ తదితరులు గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ కమిషనర్ నర్సయ్యకు వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికలకు ముందు 8వ వార్డులో భాగంగా ఉన్న శివాలయం వీధిని 16వార్డులో కొంత భాగం, 17వార్డులో కొంత భాగం కేటాయించారన్నారు.



వంతెన కట్టారు.. వెతలు తీర్చారు

మండల పరిధి వెంకట్రావ్‌పేట శివారులోని గూడెం చెరువు వద్ద హైలెవల్ వంతెన నిర్మించడంతో ప్రయాణికుల ఇబ్బందులు తీరాయి. గూడెం చెరువు అలుగు పారిన ప్రతిసారీ వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పురాతన లో లెవల్ వంతెన ఉండటంతో పైనుంచి వరద పొంగేది. గత ప్రభుత్వం రూ.1.89 కోట్లు మంజూరు చేసింది. పాత వంతెనను పూర్తిగా తొలగించారు. కొత్తగా వంతెన నిర్మించారు. – న్యూస్‌టుడే, కౌడిపల్లి

దళారులను నమ్మి మోసపోవద్దు

నార్సింగి (చేగుంట), అల్లాదుర్గం, రేగోడ్, న్యూస్‌టుడే: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యం విక్రయించాలని అన్నారు. ఎంపీడీవో ఆనంద్, తహసీల్దార్ కరీం అన్నారు. గురువారం నార్సింగి మండలంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నార్సింగి, నర్సంపల్లి, పెద్దశంకరంపేట గ్రామాల్లో వారు ప్రారంభించారు. దళారులను నమ్మి నష్టపోవద్దన్నారు. ఏపీఎం అశోక్, సీసీలు శంకర్, సుల్తానా తదితరులున్నారు. అల్లాదుర్గం మండల పరిధి రాంపూర్‌లో తహసీల్దార్ మల్లయ్య వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారం



రేగోడ్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం సంగీత తదితరులు

భించారు. ఎంపీడీవో శంకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శేషారెడ్డి, నాయకులు లక్ష్మయ్య, వెంకట్, రమూరాంరెడ్డి ఉన్నారు. రేగోడ్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం సంగీత ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొంది లబ్ధి పొందాలన్నారు. ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు ఖాతా పాస్ పుస్తకం జిరాక్స్ ప్రతులను రైతులు కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు అందించాలన్నారు. తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో సీతారామమ్మ, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కిషన్ తదితరులున్నారు.

ఆలయ వార్షికోత్సవం

చేగుంట, న్యూస్‌టుడే: మండల పరిధి చందాయిపేట వీర హనుమాన్ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు పబ్బా శ్రీనివాస్, మాజీ సర్పంచి నాగరాణి, మాజీ ఉప సర్పంచులు అంజనేయులు, సంతోష్‌కుమార్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రం భవానీ మందిరంలో గురువారం చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవీ నవరాత్రుల అనంతరం వచ్చే పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారిని మెల్కొలిపి కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్, సంతోష్, శివకుమార్ ఉన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ర్యాలీ



ఏవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: ఫీజు బకాయిలను విడుదల చేయాలని నర్సాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, అధ్యాపకులు గురువారం ర్యాలీ తీశారు. చౌరస్తా నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరము ఆర్డీవో కార్యాలయ ఏవో సహదేవ్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఫీజు బకాయిలు రాకపోవడంతో కళాశాలలు నడపడం ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: తపస్



ఓటు నమోదు పత్రాలతో ఉపాధ్యాయులు, లక్ష్మణ్

చేగుంట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్ ప్రారంభించారు. చేగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ఉపాధ్యాయులంతా తప్పకుండా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తపస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో తపస్ బలపరిచే అభ్యర్థిని గెలిపించాలని కోరారు. తపస్ మండలాధ్యక్షుడు వెంకటేశ్ తదితరులున్నారు.

సభ్యుల సహకారంతోనే ప్రగతి



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ రమేష్ గుప్తా

పాపన్నపేట, న్యూస్‌టుడే: సభ్యుల సమిష్టి కృషితో నే సంఘాభివృద్ధి సాధ్యమని కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ రమేష్ గుప్తా అన్నారు. మండల పరిధి కొత్తపల్లిలోని ఓ వేడుక మందిరంలో గురువారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. అందరి సహకారంతో సొసైటీ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.2.47కోట్ల లాభాల్లో కొనసాగుతుందన్నారు. సంఘం ఆధ్వర్యంలో రైస్‌మిల్లు ఏర్పాటు చేశామని, సభ్యులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల రుణాలు సకాలంలో అందిస్తున్నామన్నారు. రుణం పొందిన వారు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలన్నారు. సమావేశంలో పలు తీర్మానాలు చేసి, ఆమోదం తెలిపారు. మేనేజర్ శ్రావణ్‌కుమార్, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులున్నారు.

కోనో కార్పస్ మొక్కలు తొలగించరూ?

ప్రజల ఆరోగ్యానికి హానికరమని కోనో కార్పస్ మొక్కలు నాటొద్దని, ఉన్నవి తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా మండలస్థాయిలో పలుచోట్ల అధికారులు స్పందించక మొక్కలు అలాగే ఉన్నాయి. మనోహరాబాద్ మండలం జీడిపల్లి వద్ద జాతీయ రహదారిపై అండర్‌పాస్ వంతెనకు ఇరువైపులా పెద్ద ఎత్తున హరితహారంలో కోనో కార్పస్ మొక్కలు గతంలో నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి రెండు వైపులా రెండు కిలోమీటర్ల మేర ఉన్నాయి. కోనో కార్పస్ మొక్కలు పలు రకాల వ్యాధులకు కారణమవుతున్నట్లు వైద్యులు సైతం నిర్ధారించిన అధికారులు మొక్కల తొల



జీడిపల్లి వద్ద జాతీయ రహదారిపై మొక్కలు

గింపుపై దృష్టి సారించడం లేదు. జీడిపల్లితో పాటు ఆయా గ్రామాల్లో కోనో కార్పస్ చెట్లు పెరుగుతూనే ఉన్నాయి. – న్యూస్‌టుడే, మనోహరాబాద్

ధ్వంసమైన టీజీఐఐసీ పైలాన్

పారిశ్రామికవాడకు ఆదే ప్రధాన ముఖద్వారం అని తెలిపేందుకు అప్పటి టీఎస్ఐఐసీ పైలాన్‌ను ఏర్పాటు చేశారు. కొన్నిరోజుల క్రితం ఆది ధ్వంసమై ముక్కలై కిందపడి పోయింది. కాళ్లకల్-ముప్పిరెడ్డిపల్లిలో పైలాన్ ధ్వంసమై పేరు కూడా కనిపించకుండా కళావిహీనంగా తయారైంది. టీజీఐఐసీ అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో అది శిథిలావస్థకు చేరుతుంది. పైలాన్ పక్కనే రహదారిపై వంద మైళ్లపై ఏర్పాటు చేసిన స్టాప్ అండ్ గో గేట్లు కూడా ధ్వంసమయ్యాయి. దీంతో వాటిని గుర్తు తెలియని వారు ఎత్తుకెళ్లిపోయారు. అక్కడ సెక్యూరిటీ కూడా ఏర్పాటు చేసిన గది కూడా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైలాన్, సెక్యూరిటీ గది, ఇతర చోట్ల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మనోహరాబాద్



కాళ్లకల్-ముప్పిరెడ్డిపల్లి పారిశ్రామికవాడలో..

పగటి వెలుగులు.. పంచాయతీలకు భారీ బిల్లులు

న్యూస్‌టుడే, హవేలిఘనపూర్: పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలోని చాలా గ్రామాల్లో పగలు, రాత్రి తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. వీటిని ఆపేందుకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేసినా ఆన్‌ఆఫ్ స్విచ్‌లు బంద్ చేయక విద్యుత్తు వృథా అవుతోంది. హవేలిఘనపూర్ మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పంచాయతీ సిబ్బంది అలక్ష్యంతో ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ప్రజలు ఆవేదన



లింగసానిపల్లి తండాలో

వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల నిర్వహణకు నిధులు లేవని కార్యదర్శులు చెబుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మూడో లైను ఏర్పాటు చేయకపోవడంతో పగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి.

రాత్రింబవళ్లు..

మండలంలోని సర్దన, లింగసానిపల్లి తండా, స్కూల్ తండా పలు గ్రామాల్లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతున్నాయి. దీంతో పంచాయతీలపై బిల్లుల భారం పడుతుందని, వాటి నిర్వహణ సక్రమంగా జరిగేలా కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్తు ఆదాకు చర్యలు తీసుకుంటా: వెంకటేశ్వర్, ఎంపీవో

పగలే గ్రామాల్లో వీధి దీపాలు వెలుగుతున్న విషయం మా దృష్టికి రాలేదు. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి ఏయే పల్లెల్లో వెలుగుతున్నాయో తెలుసుకుంటాం. విద్యుత్తు వృథా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తా.

విజయరామరాజు సేవలు మరువలేనివి

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: ఉద్యమకారుడు, మాజీ జడ్పీటీసీ విజయరామరాజు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఉద్యమ సమయంలో, ప్రజాప్రతినిధిగా అందించిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మల్కాపూర్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. తన జీవితాన్ని ప్రజా సేవకే అంకితం చేశాడని, అలాంటి వారి కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి జయంతి

రేగోడ్, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం మండల పరిధి ఆర్.ఇటిక్యాలలో ఆయన చిత్రపటానికి ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మండలి ప్రతిపక్ష నేతను కలిసిన నాయకులు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: తెలంగాణ శాసన మండలి ప్రతిపక్ష నేతగా ఎన్నికైన ఎమ్మెల్సీ మధుసూదనాచారిని గురువారం హైదరాబాద్ మండలి కార్యాలయంలో చిన్నశంకరంపేట భారాస మండలాధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచి లక్ష్మణ్ కలిసి అభినందనలు తెలిపారు.

మంచినీటి సహాయకులకు శిక్షణ

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి రైతువేదికలో మంచినీటి సహాయకులకు శిక్షణ కొనసాగుతుంది. మూడో రోజైన గురువారం వివిధ గ్రామాల నుంచి మంచినీటి సహాయకులు హాజరయ్యారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం నర్సాపూర్ సబ్ డివిజన్ డీఈ శ్రీనివాస్ శిక్షణ శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. శిక్షకులు శ్రీకాంత్ ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ అన్వేష్‌రెడ్డి తదితరులున్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: వాహనదారులు తప్పనిసరిగా రహదారి నిబంధనలు పాటించాలని ఎస్సై శంకర్ అన్నారు. ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో గురువారం పేటలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్పీడ్ రోడ్లలో అపసవ్య దిశలో ప్రయాణించడం, వీటి వల్ల అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం తప్పని



మాట్లాడుతున్న ఎస్సై శంకర్

సరిగా ధరిస్తూ పరిమిత వేగంతో ప్రయాణించాలని సూచించారు. ఎస్సై సునీత, ఎన్‌హెచ్ మేనేజర్ ఖాజామొహినొద్దీన్ తదితరులున్నారు.

విగ్రహం విషయమై ఆందోళన

రామాయంపేట, న్యూస్‌టుడే: పురాతన హనుమాన్ విగ్రహాన్ని పాడుబడిన బావిలో తోసేయడంతో గ్రామస్థులు ఆందోళనకు దిగిన ఘటన మండల పరిధి రాయిలాపూర్‌లో గురువారం జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామంలోని సహకార సంఘానికి వెళ్లే దారిలో స్థలాన్ని చదును చేస్తూ పురాతన హనుమాన్ విగ్రహాన్ని పాడుబడిన బావిలోకి తోసేశారు. ఈ విషయమై గ్రామస్థులు సదరు వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. విగ్రహాన్ని ఓ చోట ఏర్పాటు చేసి, పూజలు చేస్తామని పోలీసులు, గ్రామపెద్దలు అధ్వర్యంలో ఒప్పుకోవడంతో గొడవ సద్దుమణిగింది.

ముగిసిన క్రికెట్ పోటీలు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి శాలిపేటలో ఖాజీ గణేష్ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గత నెల 10న ప్రారంభించారు. మొత్తం 22 జట్లు తలపడ్డాయి. గురువారం ఫైనల్‌లో గెలిచిన శాలిపేట జట్టుకు రూ.10వేల నగదు, రన్నర్‌గా నిలిచిన ఒట్టిజెపల్లి జట్టుకు రూ.5వేలు నిర్వాహకులు అందించారు.

ఎమ్మెల్సీ కేటాయింపుపై హర్షం

పాపన్నపేట, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని పొరాదేవి సంత్ సేవాలాల్ మహారాజ్ పీఠం ధర్మగురువు బాబు సింగ్ మహారాజ్‌కి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ పదవి ఇచ్చి సత్కరించడం హర్షణీయమని బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూల్‌సింగ్ అన్నారు. గురువారం ఆయన పాపన్నపేటలో మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల తరువాత ఇలాంటి నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. నాయకులు రాజు, సక్రూ, గోపాల్ తదితరులున్నారు.

కళాశాలకు దుమ్మా కొట్టొద్దు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఉన్నత చదువులకు తొలి మెట్టు అయిన ఇంటర్ కళాశాల విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలని వెల్దుర్తి రాయదుర్గ సరస్వతి స్మారక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు. గురువారం కళాశాలకు రాని విద్యార్థులకు చెందిన ఆయా గ్రామాల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాలకు తప్పకుండా రావాలని, పంపాలని తల్లిదండ్రులను కోరారు.

గ్రామసభలు నిర్వహించాలి

కౌడిపల్లి: గ్రామ సభలను నిర్వహించి ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని భాజపా శ్రేణులు గురువారం కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మండల అధ్యక్షుడు రాజేశ్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి కార్యాలయ సీనియర్ సహాయకుడు బలరాంను కలిశారు. మండలంలోని గ్రామ సభలు నిర్వహించకుండా కేవలం అధికార పార్టీ నాయకులు ఇచ్చిన జాబితాలనే ఆమోదం కోసం పంపారని ఆరోపించారు. ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు శ్రీను, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు మోమిన్, బూత్ కమిటీ అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

పల్లెల్లో పార్టీ బలంగా ఉంది: భాజపా

నర్సాపూర్ రూరల్: గతంలో కంటే భాజపా గ్రామాల్లో సభ్యత్వం బాగా పెరిగిందని భాజపా రాష్ట్ర నాయకుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్, అరవింద్‌గౌడ్ అన్నారు. మండలంలోని అచ్చంపేట, తిరుమలాపూర్ గ్రామాలలో గురువారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కేంద్ర అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికలలో తమ సత్తా చాటుతామన్నారు.

గుంతల దారితో ఇబ్బందులు

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండల కేంద్రం పెద్దశంకరంపేట బస్టాండ్ వెళ్లే మార్గం అంబేడ్కర్ చౌక్ వద్ద రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు



బస్టాండ్ రోడ్డులో ఇరుక్కుపోయిన బస్సు

ఎదురవుతున్నాయి. గుంతలో నుంచి బస్సు బయటకు వెళ్లలేక ఇరుక్కుపోయి బస్సు ముందు భాగం కింద రాసుకుపోతోంది. గురువారం ఇలా బస్సు ఇరుక్కుపోవడంతో బస్టాండ్‌లోకి వెళ్లలేక బయట రహదారి నుంచి వెళ్లాయి. ఇటీవల రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేసినా సమస్య మళ్లీ మొదటికొచ్చింది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.